# నవతరం
తెలుగు దినపత్రిక
RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 49 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
06-12-2025 శనివారం వెల : 1/- పేజీలు : 4


# విద్యతో పాటు నైపుణ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

## మెగా- పేరెంట్ టీచర్ డే సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు

**నవతరం - టెక్కలి**

విద్యతో పాటు విద్యార్థుల్లో వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. టెక్కలి జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఈ మెగా పేరెంట్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నామని, విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని తెలిపారు. అభ్యసన ఫలితాలే లక్ష్యంగా పాఠశాల విద్యలో నూతన సంస్కరణలు తీసుకురాబోతున్నామని మంత్రి ప్రకటించారు.






"డీఎస్సీ అంటే టీడీపీ... టీడీపీ అంటే డీఎస్సీ" అని పేర్కొన్న మంత్రి అచ్చెన్నాయుడు, తమ ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుందని స్పష్టం చేశారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు, విద్యకు ఇస్తున్న ప్రాధాన్యత కారణంగా అవి మళ్లీ తెరుచుకుంటున్నాయని అన్నారు. విశ్వవిఖ్యాత నట సార్వభౌమ దివంగత ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు ప్రాతినిధ్యం వహించిన టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి తాను పూర్తిగా కట్టుబడి ఉన్నానని, గత ప్రభుత్వ హయాంలో అటకెక్కిన అభివృద్ధి ఇప్పుడు పరుగులు పెడుతోందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ మెగా పేరెంట్ టీచర్ సమావేశాల ముఖ్య ఉద్దేశాన్ని గురించి వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆప్యాయంగా మమేకమై వారి ప్రగతి నివేదికలు, విద్యా ప్రమాణాలను వ్యక్తిగతంగా పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 4 వేల కోట్లతో కృషి చేస్తుందని, ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తగ్గకుండా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

పేరెంట్-టీచర్ మీటింగ్ అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పాఠశాలలో ఉన్న వసతులు, బోధన నాణ్యత, మధ్యాహ్న భోజన ప్రమాణాలపై చర్చించిన మంత్రి... వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో కృష్ణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావడంతో పండగ వాతావరణం నెలకొంది.

# ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారానే రైతులు మిల్లర్లకు ధాన్యం అందించాలి

## జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్




**నవతరం -శ్రీకాకుళం :**

ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారానే రైతులు మిల్లర్లకు ధాన్యం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. పైడిబీమవరంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా PTలో గురువారం పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహణ అవశ్యకత, ముఖ్య ఉద్దేశ్యం పై చర్చించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం మండలంలోని వల్లభరావుపేట, సంచాం, కొండములగం సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయా కేంద్రాల సిబ్బందితో ధాన్యం సేకరణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక రైతులతో మాట్లాడి ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారానే రైతులు మిల్లర్లకు ధాన్యం అందించాలని, ప్రభుత్వం వెంటనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# స్క్రబ్ టైఫస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**నవతరం -శ్రీకాకుళం :**

జిల్లాలోని ప్రజలందరూ స్క్రబ్ టైఫస్ వ్యాధి నియంత్రణ, నివారణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖాధికారులు, జిల్లాలోని ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్లతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఐదు రోజులు పూర్తిగా జ్వరం తగ్గని వారు స్క్రబ్ టైఫస్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. 'చిగ్గర్ మైట్' అనే కీటకం కుట్టడం ద్వారా ఈ ఇన్ఫెక్షన్ మనుషులకు సోకుతుందని వివరించారు. ప్రజలు ఎటువంటి భయభ్రాంతులకు గురికావాల్సిన అవసరం లేదని, వ్యాధి నిర్ధారణకు సరిపడా కిట్‌లను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. అయితే, ప్రభుత్వ నిబంధనలకు లోబడే ప్రైవేట్ ల్యాబ్‌లు పరీక్షల ధరలను నిర్ధారించాలని ఆదేశించారు.



ఈ వ్యాధి ముఖ్యంగా పొదలు, గడ్డి, పొలాలు, అడవి ప్రాంతాల్లో ఉండే చిగ్గర్లు కుట్టడం వల్ల వస్తుందని, వ్యవసాయ పనులు చేసేవారు, పశువుల పాకల్లో తిరిగేవారికి ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, అధిక జ్వరం, తీవ్ర తలనొప్పి, శరీర బలహీనత, వాంతులు ఈ వ్యాధి లక్షణాలుగా ఉంటాయని, కీటకం కుట్టిన చోట నల్లటి మచ్చ కూడా కనిపించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత చెప్పారు. స్క్రబ్ టైఫస్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. పొలాలు, పొదల్లో పనిచేసేటప్పుడు శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలని, చేతులు, కాళ్లపై కీటకనాశక లోషన్ ఉపయోగించాలని సూచించారు. పశువుల పాకలు, ఇళ్ల చుట్టూ ఉన్న గడ్డి, కలుపు మొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచడం ద్వారా ఈ వ్యాధి రాకుండా నివారించవచ్చని తెలిపారు.

స్క్రబ్ టైఫస్‌కు సమర్థవంతమైన చికిత్స ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. జ్వరం, శరీర బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీ లేదా ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులను సంప్రదించాలి. సొంతంగా మందులు కొనుగోలు చేయకుండా, వైద్యులు సూచించిన యాంటీ బయాటిక్స్‌ను సమయానికి తీసుకోవాలని కోరారు. ముందుగానే చికిత్స ప్రారంభిస్తే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. ప్రజలు ఈ జాగ్రత్తలు పాటించడం ద్వారా స్క్రబ్ టైఫస్‌ను సులభంగా నివారించవచ్చని, చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డిసిహెచ్ఎస్ కళ్యాణ్ బాబు, జి జి హెచ్ నుంచి పలు విభాగాధిపతులు, జిల్లాలోని పలువురు ల్యాబ్ టెక్నీషియన్లు హాజరయ్యారు.

# అరసవల్లి రథసప్తమికి పటిష్ఠ ఏర్పాట్లు

## ఏడు రోజుల ప్రత్యేక కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష




**నవతరం -శ్రీకాకుళం :**

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి మహోత్సవ ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం పటిష్ఠమైన క్యూలైన్ల ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏడు రోజుల పాటు ప్రతిరోజు ఆస్థాన సేవ, తిరువీధి, స్వామి అలంకరణ, లక్షపుష్పార్చన, సూర్య నమస్కారాలు వంటి ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల భద్రత దృష్ట్యా క్యూలైన్లలో సీసీ కెమెరాలు, స్క్రీన్లు ఏర్పాటు చేయాలని, వాలంటీర్లు, పోలీస్ శాఖ పర్యవేక్షణ తప్పనిసరని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు, దాతలు సమకూర్చే ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షించేందుకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని ఆదేశించారు. సమావేశంలో నమూనా శకటాలు, దేవాదాయ శాఖ తరుపున ఏర్పాట్లు, దాతల టిక్కెట్ల కేటాయింపు వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. -మిగతా 2లో

# బ్రాహ్మణతర్లలో మెగా పేరెంట్ టీచర్ సమావేశం

## నియోజకవర్గం ఎమ్మెల్యే గౌతు శిరీష



ఎడిటోరియల్

# పంచాయతీ పదనిసలు

పల్లెసీమల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు జాతిపిత మహాత్మా గాంధీ. గ్రామ స్వరాజ్యమే దేశ సౌభాగ్యమని నొక్కిచెప్పారు. ఇప్పుడు మన రాష్ట్రంలో అలాంటి గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగబోతున్నాయి. రిజర్వేషన్లు, వాటిపై కోర్టుల్లో దావాలు, నోటిఫికేషన్లు, నామినేషన్ల ఘట్టాలు ఒకదాని తర్వాత ఒకటి కొనసాగాయి. మరో పదిహేను ఇరవై రోజుల్లో కొత్త సర్పంచులు, వార్డు మెంబర్లు బాధ్యతలు కూడా స్వీకరిస్తారు. అయితే ఇక్కడ మనం గమనించాల్సింది.. సిద్ధాంతాలు, విధానాల ప్రాతిపదికన కాకుండా మొత్తం మనీ పాలిటిక్స్, పవర్ పాలి'ట్రిక్స్' రాజ్యమేలుతున్న తరుణంలో నిజంగా గ్రామాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నదెవరు? ఆ లక్ష్యం ఆచరణలో అమలవుతోందా? అనేది కీలకం.

పంచాయతీలకు ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం కావటం మంచిదే. కానీ ఆ క్రమంలో కొనసాగుతున్న తంతులే విచిత్రంగా ఉంటున్నాయి. ఏకగ్రీవం అయిన పంచాయతీల్లో సర్పంచులు రూ.50 లక్షల నుంచి రూ.కోట్ల వరకూ బాండ్ పేపర్ మీద రాసిస్తుండటం గమనార్హం. 'ధనం మూలం ఇదం జగత్%ొ%' అన్నట్టు ప్రజాసేవ కంటే 'పైసల'తోనే ఎక్కువవుతోంది. కొన్నిచోట్ల 'మేం గతంలో ఓడిపోయాం, ఈసారి కచ్చితంగా గెలిపించండి%ొ%' అంటూ అభ్యర్థులు కంటతడిపెట్టిన సన్నివేశాలూ రక్తికట్టాయి. మరికొన్ని చోట్ల ప్రభుత్వాల విధానాలు, అధికారుల నిర్లక్ష్యానికి విసిగి వేసారిన ప్రజలు అసలు నామినేషన్లే దాఖలు చేయకపోవటం పాలకుల పాలసీల పెరాలసిస్‌కు పరాకాష్ట. మంచిర్యాల జిల్లాలో మూడు, ఆసిఫాబాద్, నిర్మల్‌లో ఒక్కోటి చొప్పున గ్రామాల్లో నామినేషన్లను దాఖలు చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 133 వార్డుల్లో ఒక్క నామినేషనూ పడలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసు కోవచ్చు. మరీ విచిత్రమేమంటే%ొ%మొన్నటిదాకా ప్రభుత్వం వైపు నుంచి బిల్లులు రాలేదని మాజీ సర్పంచులు ఆందోళనలు చేపట్టినా.. ఇప్పుడు రెట్టింపు ఉత్సాహంతో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టేందుకు అభ్యర్థులు ముందుకు రావటం.

ఈ నేపథ్యంలో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు గ్రామాల అభివృద్ధి అనుకున్నంత స్థాయిలో జరిగిందా? నిజంగా స్థానిక సంస్థాధీశులు ప్రజల బాగోగులు పట్టించుకుంటున్నారా? అనే సంశయం కూడా కలగక మానటం లేదు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలను స్వేచ్ఛగా, స్వతంత్రంగా పని చేయనిస్తున్నాయా? అనేది కూడా కీలకాంశం. వామపక్షాల ఏలుబడిలో ఉన్న కేరళలో అక్కడి ప్రభుత్వం%ొ% స్థానిక సంస్థలను అదే రకంగా పనిచేయిస్తోంది. ప్రజాభిప్రాయం ప్రకారమే పంచాయతీలు, పురపాలక, నగర పాలక సంస్థల్లో పాలన సాగుతోంది. దీంతో అక్కడ అనేక ఫలితాలు వస్తున్నాయి. అదే రకమైన చర్యలను తెలంగాణలోనూ చేపట్టాలి. స్థానిక సంస్థలు ఎంతబలంగా ఉంటే అంతగా రాష్ట్రాభివృద్ధి సాధ్యమనే వాస్తవాన్ని గుర్తించాలి. కానీ అందుకు భిన్నంగా మన దగ్గర పరిస్థితి కొనసాగుతోంది. నిర్మొహమాటంగా చెప్పాలంటే ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధి హామీ పథకానికి తప్ప మిగతా ఏ ఒక్కదానికీ నిధులు విడుదల కావటం లేదు. పంచాయతీల్లోని కారోబార్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సఫాయి కార్మికులకు జీతాలివ్వలేని దుస్థితిలో అవి కొట్టుమిట్టాడుతున్నాయి.

గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదనే సాకుతో తెలంగాణకు రావాల్సిన రూ.3,500 కోట్లను కేంద్రం విడుదల చేయకుండా తొక్కిపట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (మార్చితో ముగియనుంది) చివరి నాటికి వాటిని విడుదల చేయించుకోవాలి. లేదంటే అవి మురిగిపోతాయి.. ఇది రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితి.అందువల్ల పంచాయతీ పోరు ముగిసిన వెంటనే సీఎం మళ్లీ ఢిల్లీ విమానమెక్కటం, నిధులు విడుదల చేయండి మహాప్రభో అంటూ కేంద్ర పెద్దలకు వినతిపత్రమివ్వటం ఖాయం. ఇక సర్పంచులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ రూ.400 కోట్ల కోసం వారు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇలాంటి పరిణామాల దృష్ట్యా రాజ్యాంగంలోని 73, 74 సవరణల ద్వారా స్థానిక సంస్థలను బలోపేతం చేయాలనే సమున్నత లక్ష్యం నీరుగారిపోతోంది.

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అది మరింత నిర్వీర్యమైంది. జీఎస్టీని తీసుకొచ్చి రాష్ట్రాలనే అడుక్కునే స్థితికి దిగజార్చిన కేంద్రం.. ఇప్పుడు స్థానిక సంస్థల అధికారాలపై కన్నేసింది. క్రమక్రమంగా వాటికి కత్తెరేసే పనులకు శ్రీకారం చుట్టింది. అందువల్ల పంచాయతీ ఎన్నికలను నిర్ణీత సమయంలో సమర్థవంతంగా నిర్వహించటంతోపాటు ఆ తర్వాత కూడా వాటి స్వయం ప్రతిపత్తిని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుంది. తెలంగాణ జనాభాలో ఇప్పటికీ అరవై శాతం మందికిపైగా ఆధారపడిన వ్యవసాయ రంగం గ్రామసీమలను పచ్చగా కళకళలాడేలా ఉంచుతోంది. అతి కీలకమైన ఈ విషయాన్ని గుర్తించి, పంచాయతీల పాలకమండళ్లకు ఇవ్వాల్సిన గౌరవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి. స్థానిక సంస్థలకు నిధులు, విధులు, అధికారాలనే సూత్రాన్ని కాపాడటానికి కేంద్రంపై యుద్ధానికి సిద్ధమవ్వాలి.

# అరసవల్లి రథసప్తమికి పటిష్ఠ ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి

ఎగ్జిబిషన్ స్టాల్లు, ఫుడ్ కోర్టులు, సైనేజ్ బోర్డులు, ఇన్విటేషన్ పంపిణీ, పార్కింగ్ ప్రాంతాల నిర్వహణకు సంబంధించి అధికారులను నామినేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ దొనక పృథ్వీ రాజ్ కుమార్, డీఆర్ఓ లక్ష్మణ మూర్తి, శ్రీకాకుళం ఆర్‌డీఓ కె. సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, డీఎంహెచ్ఓ అనిత, సుడా ఈఈ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణతర్లలో మెగా పేరెంట్ టీచర్ సమావేశం



**నవతరం -పలాస**

పలాస మండలం బ్రాహ్మంతర్ల గ్రామంలో ఉన్న జడ్పీహెచ్ పాఠశాలలో "మెగా పేరెంట్స్ టీచర్స్" సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గం ఎమ్మెల్యే గౌతు శిరీష హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో, విద్యార్థుల సమస్యలు, పాఠశాల అభివృద్ధి, ఉపాధ్యాయుల పనితీరు వంటి అంశాలపై చర్చించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేస్తే విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు పాఠశాలలో సౌకర్యాలను మెరుగుపరచాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన పాఠాలు బోధించాలని ఆమె సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పనిచేస్తే విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడుతుందని, ఈ లక్ష్యం సాధించేందుకు కలిసి పనిచేద్దాం అని కోరారు. ఈ కార్యక్రమంలో దువ్వాడ కృష్ణ మూర్తి, మల్ల శ్రీనివాస్, కుత్తం లక్ష్మన్, వంకల కూర్మారావు, పార్వతి, అవగాన దశరథ, ఆనంద్, ఎంపీడీఓ, ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బావితర పౌరులకు "శాంతిమంత్రం" ఆయుధం కావాలి

**- లయన్స్ డా.పైడి.సింధూర**

**నవతరం -శ్రీకాకుళం**

బావితర పౌరులకు "శాంతిమంత్రం" ఆయుధం కావాలని, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు లయన్స్ డా.పైడి.సింధూర అన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు గత మాసంలో నిర్వహించిన పీస్ పోస్టర్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులను అందజేశారు. ఇందులో భాగముగా డా.పైడి.సింధూర మాట్లాడుతూ శాంతి అనే ఆయుధంతో ఎలాంటి విజయాలనైనా సాధించవచ్చుని మరోసారి విద్యార్థులు నిరూపించారని, పీస్ పోస్టర్ కంటెస్ట్ జిల్లా చైర్మన్ ఎం.ఎస్ఎన్.మూర్తి విద్యార్థులకు శాంతి మంత్రాన్ని, ఆయుధంగా ఎలా వాడాలో తెలిపారని, శాంతం ఎక్కడ వుంటుందో అక్కడ సంతోషం, సంతృప్తి వుంటాయన్నారు. గెలుపొందినవారిలో మొదటి స్థానం భాష్యం పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థి ఎల్.వినోద్, ద్వితియ స్థానం రవీంద్ర భారతి పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి ఎల్.జస్వంత్, తృతీయ స్థానం నారాయణ ఐఐటి ఏడో తరగతి విద్యార్థిని కే.ఇషా ఉన్నారని, కార్యదర్శి టెక్కం.రామగోపాల్,



ఉపాధ్యక్షులు బోగెల ఉమామహేశ్వర రావులు, ఉర్లం.శివతేజ పట్నాయక్ లు తెలిపారు. అనంతరం లయన్స్ ఇంటర్నేషనల్ బహుమతులను, ప్రశంసాపత్రాలను, భాష్యం పాఠాశాల ప్రిన్సిపాల్ సురేష్, రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.తిణేష్, డిఐ రమేష్, నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్ లతో కలసి అందించారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సీనియర్ సభ్యులు జీఎన్వి జ్యుయలర్స్ అధినేత ఊన్న.కిరణ్ కుమార్, మార్కెటింగ్ చైర్పర్సన్ పొడుగు.చరణ్, సభ్యులు చౌదరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నిర్బంధాలు ఎత్తివేయాలి



**నవతరం -శ్రీకాకుళం:**

ప్రభుత్వ నిర్బంధాన్ని ఎత్తివేయాలని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరుతూ కోరుతూ శుక్రవారం శుక్రవారం ఎస్పీ గారికి వామపక్ష నాయకులు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ వామపక్ష పార్టీ నాయకులు కోనేరు మోహన్రావు కొన్న శ్రీనివాసరావు వినతిపత్రం సమర్పించారు అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై ప్రదర్శనలో ధర్నాలకు అనుమతులు నిరాకరించడాన్ని నిరసిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానాన్ని ప్రభుత్వ యంత్రాంగాన్ని దృష్టికి తీసుకువెళ్లారు రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ఎత్తివేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రజల హక్కులు కాపాడాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గతంలో కార్గో ఎయిర్పోర్ట్ రద్దు చేయాలని థర్మల్ పవర్ ప్లాంట్ రద్దు చేయాలని కోరుతూ ధర్నాలు చేయడానికి ప్రభుత్వం అనుమతులు నిరాకరించడానికి వారు గుర్తు చేశారు సభలు సమావేశాలు అనుమతులు నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని వారన్నారు రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్రం సభలు సమావేశాలు జరిపిన హక్కులను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

# విద్యార్థుల భవిష్యత్తు రూపకల్పనలో తల్లిదండ్రుల పాత్ర గొప్పది

**జిల్లా చైర్మన్ కరణం శోభారాణి**

**నవతరం -శ్రీకాకుళం**

విద్యార్థుల భవిష్యత్తు రూపకల్పనలో తల్లిదండ్రుల పాత్ర గొప్పదని, హర్షవల్లి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం జిల్లా చైర్మన్ కరణం.శోభారాణి అన్నారు. స్థానిక రెల్లవీధి మున్సిపల్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీట్ లో ముఖ్య అతిథిగా లయన్ కరణం.శోభారాణి పాల్గొని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ సమ్మేళనం విద్య వ్యవస్థ మెరుగుపడటానికి ఎంతగానో సహకరిస్తుందని, ఉపాధ్యాయులు తల్లిదండ్రుల మధ్య వారధిగా నిలుస్తోందన్నారు. సాంకేతిక విప్లవముగా మనం భావిస్తున్న మొబైల్ వినియోగం ఎంత ప్రయోజనకరంగా ఉంటుందో, చిన్నారుల విషయంలో అంతే హానికరమని, చదువులు సక్రమంగా కొనసాగాలంటే మొబైల్ సంస్కృతికి చిన్నారులను దూరంగా ఉంచాలని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న క్లబ్ వ్యవస్థాపకులు లయన్ కరణం హారిక ప్రసాద్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ముఖ్యంగా ప్రాథమిక విద్యావ్యవస్థలో చిన్నారులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా తగు శ్రద్ధ వహించాలని,



పాఠశాలలో చెప్పిన అంశాలను పిల్లలు ఇంటికి వచ్చిన తర్వాత వారితో మరొకసారి చర్చించి మననం చేయించాలన్నారు.. తమ పిల్లల విద్యా బాధ్యత ఉపాధ్యాయులదని నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవకమైన మార్పులను తీసుకువస్తూ ఉన్నారని, ఇందులో భాగంగానే తల్లిదండ్రులు ఉపాధ్యాయులు చిన్నారుల మెగా సమ్మేళనాన్ని ఏర్పాటు చేయడం సంతోషదాయకమని అన్నారు.

# 7న రా.ర.వే 11వ వార్షికోత్సవం

**నవతరం- రాజాం**

రాజాం రచయితల వేదిక 11వ వార్షికోత్సవం ఈనెల 7 ఆదివారం సాయంత్రం జరుగుతుందని వేదిక నిర్వాహకుడు గార రంగనాథం తెలియజేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరగనున్న ఈ సమావేశంలో పిల్లా తిరుపతి రావు రచించిన "పచ్చడం" సాహిత్య వ్యాస సంపుటిని తెలంగాణ శాసనమండలి సభ్యుడు, ప్రజా గాయకుడు గోరటి వెంకన్న ముఖ్య అతిథిగా ఆవిష్కరిస్తారు. గార రంగనాథం అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో గంటేడ గౌరునాయుడు, రచయిత తిరుపతిరావు తోపాటు బి.వి అచ్యుత కుమార్ తదితరులు హాజరవుతారు.

సాహితీ బంధువులు, సాహిత్యాభిమానులు, కవులు, గాయకులు, రచయితలు, కళాకారులు అందరూ హాజరై సభను జయప్రదం చేయవలసిందిగా రంగనాథం కోరారు.

# వారే వీరులు...విప్లవకారులు..!

కులం..మతం..
మొన్న ఒక అవసరం
నిన్న ఒక అభిమాన వేడుక
నేడు అహంకారానికో అగ్నిగోపురం...

కులం...మతం..
రెండు నేడు అదృశ్యంగా
ఆరక రగిలే అగ్నిగుండాలు...
రాజకీయాలకు రథచక్రాలు...
అధికార పీఠాలకు అక్షయ పాత్రలు...

కులం...మతం...
కొందరు అవినీతిపరులకు
ఆశబోతులకు అహంకారులకు
పండే పచ్చని పంటలు
కొందరికి చీకటిలో చితిమంటలు...

కులం...మతం...
ఒక స్వార్థం..అది వ్యర్థం..
కాదది సమతామార్గంలో నడిచే
సత్యవంతుల జీవిత పరమార్థం...
కాదది సంఘసంస్కర్తల జీవన యజ్ఞం...

కులాల కుడ్యాలు కూలిననాడే...
మతమౌఢ్యాన్ని మట్టుపెట్టిననాడే...
అసమానతల అగాధాన్ని
సమాధి చేసిననాడే...
కత్తికి పదునుపెట్టి అక్రమాలకు
అణచివేతలకు చరమగీతం పాడిననాడే...

నయవంచకుల
గుండెల్లో నిదురించిననాడే...
అభివృద్ధి నిరోధకుల్ని ఎదిరించిననాడే...

సమాజాన్ని జలగల్లా పట్టిపీడించే
చీడపురుగులను ఏరి పారేసిననాడే...
అంధవిశ్వాస భూతాల్ని
తరిమికొట్టిననాడే...

తాడిత...పీడిత...బడుగు
బలహీన వర్గాల చీకటి బ్రతుకుల్లో
చిరుదివ్వెలు...వెలిగించిననాడే....
అభ్యున్నతికి అస్త్రాలు సంధించిననాడే...
నాడే నవసమాజ నిర్మాణానికి పునాది...
నాడే అంబేద్కర్ ఆశయాలు సిద్ధించేది...

అందుకై...
నిస్వార్థంగా శ్రమించే
ప్రాణత్యాగం చేసే వారంతా
శూరులే...సూర్యులే
వీరులే...విప్లవకారులే
చిరంజీవులే సదా చిరస్మరణీయులే...



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# ఘనంగా సిక్కోలు హరిత మహోత్సవం ప్రారంభం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే గొండుశంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం నగర పరిధిలో స్థానిక ఎయిట్ ఫీట్ రోడ్లో గల బృందావన్ ఫంక్షన్ హాల్లో సిక్కోలు హరిత మహోత్సవం కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ శ్రీకాకుళానికి ఒక మంచి కార్యక్రమాన్ని తెచ్చినందుకు మెడికల్ అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను అదేవిధంగా సేంద్రియ ఎరువులు టూరిజం పచ్చని చెట్లు గురించి ప్రచారం చేయడంలో మీలాంటి స్వచ్ఛంద సేవా సంస్థలు ఎంతగానో దోహద పడుతున్నాయని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం రోజురోజుకు పెరుగుతున్న క్రమంలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం ప్రాధాన్యమని. భారత వ్యవసాయం భవిష్యత్తు సేంద్రియముతోనే ముడిపడి ఉన్నదని సేంద్రియ వ్యవసాయం అయితే రైతుల పరుగులు తీస్తున్నారని తెలిపారు. సేంద్రియ




వ్యవసాయం మనందరికీ తెలిసినట్టుగా సెంటిటీకి రసాయన లేకుండా పంటలను పండించడానికి భారత సాంప్రదాయ జ్ఞాన వ్యవస్థలు ఆధునిక పర్యావరణ సూత్రాలు నుంచి తీసుకోబడింది ఇది మొక్కలు చెట్లు, పశువులు సహజ వైద్యానికి మద్దతు ఇవ్వడానికి కలిసి జీవించే వైవిధ్య భరితమైన పొలాలను ప్రోత్సహిస్తుంది. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో శ్రీకాకుళానికి అందించాలని స్వచ్ఛంద సేవా సంస్థలకి అభినందించారు.

# తల్లిదండ్రుల కన్న కలలు నెరవేర్చండి


### పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో విద్యార్థులకు సూచించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్

**నవతరం - రణస్థలం**

పాతర్లపల్లి హైస్కూల్ నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ లో పాల్గొన్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజల్వన చేసి అక్కడ ఉన్న దేశ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సంకల్ప బలం ఉంటే సాధించలేనిది ఏమి లేదుని, ఆ దిశగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలని, తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేసేలా విద్యార్థులు గొప్పగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో చైర్మన్



అవినాష్, బిసి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గురజాపు రాము, పిన్నింటి బానోజీ నాయుడు,బస్వా గోవిందరెడ్డి, అనంత్ మహంతి, దన్నాన రవీంద్ర,మైలపల్లి పోలీస్, సుంకర ధనుంజయ్,గొర్లె సాయిదీప్, మీసాల మౌళిశ్వరరావు, మీసాల చిన్నప్పయ్య,కరాటే లక్ష్మణ్,సూరాడ రాముడు, ఎంపీడీఓ, తహసీల్దార్, మండల విద్యాశాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.



# కళ్లు బైర్లుకమ్మే పారితోషికం.. నిజమేనా ప్రభాస్?

ఫలానా హీరో వంద కోట్ల రూపాయల రెమ్యూనరేషన్ తీసుకుంటున్నాడంటే చాలా పెద్ద విషయం. ఈ లిస్ట్ లో చాలామంది పేర్లు నలుగుతున్నాయి. ప్రభాస్ నుంచి మొదలైన ఈ ఎలైట్ క్లబ్ లో మహేష్, బన్నీ లాంటి చాలామంది నటులు చేరినట్టు వార్తలొచ్చాయి. ఇప్పటికీ కొంతమంది హీరోల పారితోషికాలపై వంద కోట్ల పుకార్లు వినిపిస్తూనే ఉన్నాయి. అంతలోనే కొత్త షాకిచ్చాడు ప్రభాస్. ప్రస్తుతం చేస్తున్న స్పిరిట్ సినిమాకు ప్రభాస్ ఏకంగా 160 కోట్ల రూపాయలు ఛార్జ్ చేశాడంటూ బాలీవుడ్ నుంచి గాసిప్స్ వినిపిస్తున్నాయి.

నిజంగా ఇది క్రేజీ. వంద కోట్లు అనే మాటే ఇంకా సగటు ప్రేక్షకుడికి మింగుడు పడడం లేదు.

అంతలోనే 160 కోట్ల రూపాయల ఫిగర్ బయటకు రావడంతో సామాన్య ప్రేక్షకుడే కాదు, ఇండస్ట్రీ జనాలు కూడా షాక్ అవుతున్నారు.

ప్రభాస్ కు దేశవ్యాప్తంగా క్రేజ్ ఉన్నమాట వాస్తవం. అతడి సినిమా ఫ్లాప్ అయినా వంద కోట్లు చేస్తుందనేది కూడా అంతే వాస్తవం. వెయ్యి కోట్లు ఆర్జించిన సినిమాలు ప్రభాస్ ఖాతాలో ఉన్నాయి. అమెరికా, యూరోప్ తో పాటు జపాన్ లాంటి దేశాల్లో కూడా ప్రభాస్ కు ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. కాబట్టి అతడు 160 కోట్లు డిమాండ్ చేశాడంటే నమ్మొచ్చు.

సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో తెరకెక్కుతున్న స్పిరిట్ సినిమాలో ప్రభాస్ సరసన తృప్తి దిమ్రి హీరోయిన్. ఈ సినిమాకు 6 నెలల కాల్షీట్లు కేటాయించాడట ప్రభాస్. త్వరలోనే సినిమాకు సంబంధించిన భారీ షెడ్యూల్ మెక్సికోలో మొదలవుతుంది.

# ఉన్నఫలంగా దిల్ రాజు ప్రకటన అందుకేనా?

దిల్ రాజు తదుపరి ప్రాజెక్టు ఏంటనే చర్చ చాన్నాళ్లుగా నడుస్తోంది. దీనికి సంబంధించి ఎప్పటికప్పుడు ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇలాంటి రూమర్స్ వచ్చినప్పుడు మేకర్స్ పెద్దగా పట్టించుకోరు. కొంతమంది ఆఫ్ ది రికార్డ్ వాటిని ఎంజాయ్ చేస్తారు కూడా. కానీ దిల్ రాజు మాత్రం స్పష్టమైన ప్రకటన చేశారు. ఇన్నాళ్లూ లేనిది ఇప్పుడే, ఉన్నఫలంగా, ఆఘమేఘాల మీద దిల్ రాజు ప్రకటన చేయడానికి కారణం ఏంటి? కొన్ని రోజులుగా దిల్ రాజు, పవన్ కల్యాణ్ కాంబినేషన్ పై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఒక విడత సినిమాలు పూర్తిచేసిన పవన్ కల్యాణ్, మలి విడతలో దిల్ రాజుకు అవకాశం ఇచ్చినట్టు కథనాలు వస్తున్నాయి. మరికొందరు మరో అడుగు ముందుకేసి దిల్ రాజు, పవన్ సినిమాకు 'అర్జున' అనే టైటిల్ పెట్టినట్టు కూడా రాసుకొచ్చారు.

ఇలాంటి పుకార్లు దిల్ రాజుకు కొత్త కాదు. కాకపోతే, ఇలాంటి టైమ్ లో పవన్ తో సినిమా అంటూ రూమర్స్ రావడం దిల్ రాజును ఇబ్బందుల్లో నెడుతోంది. దీనికి ఓ కారణం ఉంది.

ఈమధ్య కోనసీమలో పర్యటిస్తూ, తెలంగాణ రాజకీయ నాయకులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు పవన్. తెలంగాణ నేతల దిష్టి తగిలి కోనసీమలో కొబ్బరిచెట్లు ఎండిపోతున్నాయనేది ఆయన మాట. దీనిపై తెలంగాణ సమాజం భగ్గుమంటోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ అనే తేడా లేకుండా అంతా పవన్ వ్యాఖ్యలపై దుమ్మెత్తిపోస్తున్నారు. బీజేపీ మాత్రం సైలెంట్ గా ఉంది, అది వేరే సంగతి. ఓవైపు పవన్ వ్యాఖ్యల్ని వక్రీకరించారంటూ జనసేన పార్టీ జస్ట్ 2 లైన్లతో ప్రెస్ నోట్ రిలీజ్ చేసినప్పటికీ, తెలంగాణ నేతలు తగ్గడం లేదు. పవన్ కు వార్నింగుల మీద వార్నింగులు ఇస్తున్నారు.

ఇలాంటి టైమ్ లో పవన్ తో దిల్ రాజు సినిమా అనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం తెలంగాణ ఎఫ్ డీ సీ ఛైర్మన్ గా ఉన్న దిల్ రాజుకు కచ్చితంగా ఇబ్బంది కలిగించే విషయమే ఇది. అందుకే ఆయన పరోక్షంగా తన అప్ కమింగ్ సినిమాలపై అధికారిక ప్రకటన చేశారని అనుకుంటున్నారు చాలామంది.



# ఉజ్వలమైన భవిష్యత్తును అందిపుచ్చుకోవాలి

- పేరెంట్, టీచర్, స్టూడెంట్ ల కలయిక గొప్ప ఆలోచన
- మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ (3.0)లో సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పైడి పద్మావతి





**నవతరం-సరుబుజ్జిలి**

విద్యార్థులు చదువుతోపాటు మంచి బుద్ధులు, అలవాట్లను కలిగి ఉజ్వలమైన భవిష్యత్తును అందిపుచ్చుకోవాలని సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పైడి పద్మావతి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, ఇంటర్మీడియట్ విద్య ఉన్నతాధికారుల సూచనల మేరకు శుక్రవారం సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 3.0 సమావేశం ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశ ప్రారంభోత్సవంలో ప్రిన్సిపాల్ పైడి పద్మావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పేరెంట్ టీచర్స్ మీటింగ్ చాలా గొప్ప ఆలోచనగా అభివర్ణించారు. పేరెంట్, టీచర్, స్టూడెంట్ ల కలయికతో వారివారి పిల్లల లోటుపాట్లు, చదువుల తీరుతెన్నులు, వారి సత్ ప్రవర్తన తదితర విషయాలను నేరుగా పేరెంట్స్ కే తెలియజేయడం జరుగుతుందన్నారు. లక్ష్యాలను నిర్ధేశించుకుని.. మండల జెడ్పీటీసీ సభ్యులు ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్ధేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. టాపర్ గా నిలిచిన విద్యార్థికి రూ. 5వేలు నగదు బహుమతిని అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రసంగించారు. విద్యార్థులు ప్రొగ్రెస్ కార్డులను పేరెంట్స్ కు చూపించి వారి మార్కులు, స్థితిగతులను లెక్చరర్లు వివరించారు. పేరెంట్స్ తో కలిసి విద్యార్థులు పంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటి ఛైర్మన్ ఇల్లాకల ప్రభారరావు, మామిడి సింహాచలం, స్థానిక ప్రజాప్రతినిధులు, రమేష్ సాహు, యూడీసీ రమేష్, వినోద్ రాజ్, శ్రీనివాసరావు, గోవిందరావు, విజయ్ కుమార్, విజయ, గౌతమవీణ, తారాచంద్, ప్రసాదరావు, ఉపేంద్ర, దుర్గా ప్రసాద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కావలి గ్రామం మెగా పేరెంట్స్ సమావేశంలో సర్పంచ్ ప్రతినిధి గురుగుబెల్లి రాజేశ్వరరావు

నవతరం- సంతకవిటి

స్థానిక మండలం కావలి గ్రామం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నేడు ప్రధానోపాధ్యాయులు మహేశ్వరరావు అధ్యక్షతన మెగా పేరెంట్స్ మరియు ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ ప్రతినిధి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఆయన పిల్లలను, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తుకు మరియు గ్రామ అభివృద్ధికి విద్యే అసలైన పునాది అని ఈ విషయంలో పిల్లల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు అశ్రద్ధ వహించరాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, ఉచిత సదుపాయాలు (పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటివి) కల్పనపై ప్రభుత్వాలు ఇంకా దృష్టి సారించాలని కోరారు.

దేశంలో పేదరికాన్ని జయించడానికి విద్య ఒక్కటే ప్రధాన మార్గమని, అందుకే తల్లిదండ్రులు పిల్లల చదువును ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

తల్లిదండ్రులు తమ పిల్లలు పాఠశాలల్లో ఎలా చదువుతున్నారో తెలుసుకోవడానికి నెలకోసారైనా పాఠశాలను సందర్శించాలని అలాగే ఉపాధ్యాయులతో మాట్లాడాలని కోరారు. పాఠశాల నుండి వచ్చిన తమ పిల్లలు ఇంట్లో చదువుకోవడానికి శాంతియుతమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఎంతైనా ఉందని నొక్కి చెప్పారు. పిల్లలు మొబైల్ ఫోన్లు, టీవీలకు బానిసలు కాకుండా ఉండేలా చూడాలని తల్లిదండ్రులను ఉపాధ్యాయులను కోరారు.

పిల్లలు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. తన సమయంలో గ్రామ సర్పంచ్‌గా, పాఠశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తాను అని హామీ ఇచ్చారు.గ్రామ పంచాయతీ నుండి పాఠశాలకు కావలసిన అన్ని సహాయ సహకారాలు అందిస్తానని, విద్యార్థుల భవిష్యత్తు తమకు అత్యంత ముఖ్యమని అన్నారు. గ్రామ ప్రజలు, పూర్వ విద్యార్థులు మరియు దాతలు కూడా పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి జేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు స్థానిక నాయకులు కలిసి పనిచేస్తేనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందించగలమని అన్నారు.

?విద్యార్థులు బాగా చదివి, మన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలనీ,

?"మన పిల్లల బంగారు భవిష్యత్తు కోసం, మనం బడి వైపు ఒక్క అడుగు వేద్దాం." అని అన్నారు.పాఠశాల మన అందరి ఆస్తి. దీని అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మెన్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు సత్యన్నారాయణ, విద్యార్థులు అలాగే వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పిల్లల బంగారు భవిష్యత్తుకు, గ్రామ అభివృద్ధికి విద్యే అసలైన పునాది



## మహిళల వాలీబాల్‌లో శ్రీకాకుళం విజయం

**నవతరం-ఎచ్చెర్ల**

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నాలుగు క్యాంపస్‌ల విద్యార్థుల కోసం శ్రీకాకుళం ఐఐఐటీ ప్రాంగణంలో జరుగుతున్న ప్రతిష్టాత్మకమైన 'ఇంటర్ క్యాంపస్ స్పోర్ట్స్ టోర్నమెంట్' రెండవ రోజూ ఉత్సాహంగా కొనసాగింది. ఆర్జీయూకేటీ స్పోర్ట్స్ బోర్డు, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మెగా టోర్నమెంట్‌లో ఆర్.కె. వ్యాలీ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ప్రాంగణాల విద్యార్థులు వాలీబాల్, చెస్ వంటి క్రీడాంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. రెండవ రోజు జరిగిన కీలక మహిళల వాలీబాల్ పోరులో శ్రీకాకుళం జట్టు నూజివీడు జట్టుపై విజయకేతనం ఎగుర వేసి ఉత్కంఠకు తెర దించింది. అంతకుముందు రోజు జరిగిన మ్యాచ్‌లలో నూజివీడు జట్టు విజయం సాధించగా, మరొక మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు ఆర్.కె. వ్యాలీపై ఏకపక్షంగా గెలుపొందింది. ఈ క్రీడా పోటీలలో పురుషులు, మహిళల విభాగాలలో శ్రీకాకుళం, ఒంగోలు, ఆర్కే వ్యాలీ, నూజివీడు జట్ల మధ్య పోటీలు హెూరాహెూరీగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటధనబాలాజీ, పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ రవి గేదెలతో పాటు స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు దిలీప్ కుమార్, కృష్ణంరాజు, ఇతర క్యాంపస్‌ల ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో వీక్షించారు.

# ఐఐఐటీలో ఉత్కంఠభరితంగా ఇంటర్ క్యాంపస్ క్రీడలు



# ఆసరా బ్రోచర్ ఆవిష్కరణ...



**నవతరం -శ్రీకాకుళం**

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ఆసరా సంస్థ అలుపెరుగని కృషి చేస్తుందని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 గవర్నర్ కొంక్యాన మురళీధర్ అన్నారు.. శుక్రవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆసరా సంస్థ ప్రచురించిన గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అతిపెద్ద ఆర్గనైజేషన్ గా ఆసరా అవతరించిందని.. దేశ వ్యాప్తంగా వినియోగదారులకు అవగాహన కల్పించడంలో ఆసరా సంస్థ ముందు వరసలో నిలిచిందని అన్నారు.. ఈ నెల ఆరవ తేదీన విజయవాడలో జాతీయ సెమినార్ జరుగుతుందని.. దీనికి సంబంధించి గోడపత్రిక ఆవిష్కరణ ఈ రోజు చేశామని చెప్పారు.. ఈ కార్యక్రమంలో ఆసరా సంస్థ ప్రతినిధులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా.. కె పి సారధి.. స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్..శాసపు జోగినాయుడు.. గుడ్ల జగ్గారావు.. గేదెల లక్ష్మీ.. సుగంధం సంజీవరావు.. డాక్టర్ బొడ్డేపల్లి ప్రసాదరావు.. డి. కృష్ణారావు .. తిరుపతి రావు.. తదితరులు పాల్గొన్నారు..

# బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులకు ఘన సన్మానము

**నవతరం -పలాస**

బిజెపి పార్టీ ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులుగా పలాస కు చెందిన లక్కోజు ధర్మారావుని పార్టీ అధిష్టానము నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆయనను ఇచ్ఛాపురం పలాస టెక్కలి నియోజకవర్గాల బిజెపి నేతలు ముఖ్య అనుచరులు ఆర్ఎస్ఎస్ పరిచారకులు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు లక్కోజు ధర్మారావు మాట్లాడుతూ జిల్లాల్లో ఉన్న 36 మండలాల్లో ఓబీసీ కులాలను జాగృతము చేసి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతుగా శక్తికి మించి కృషి చేస్తానని ఇందుకు జిల్లాలో గల అన్ని నియోజకవర్గాల్లో తమ నేతలు కార్యకర్తలు సహకారంతో ముందుకు వెళదామని తనకు జరిగిన ఈ సత్కారం తనది కాదని ఇది ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్తకు చెందుతుందని పార్టీలో కష్టపడి పని చేస్తే ప్రతి ఒక్కరికి పార్టీ గుర్తింపు ఇస్తుందని తన సన్మానము ప్రతి కార్యకర్తకు అంకితం అవుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జోనల్ ఇన్చార్జి రౌతు చిరంజీవి రావు, మందస మండల పార్టీ అధ్యక్షులు తులుకుల సురేషు, వజ్రపుకొత్తూరు మండలం పూర్వపు అధ్యక్షులు మరడ మనోజ్ కుమార్, బిజెపి సీనియర్ నేత పేరాడ యోగేశ్వరరావు, బొండా శ్రీనివాసరావు, ఇప్పిలి వెంకట్రావు, కూటమినేత పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 18 వ వార్డు ఇంచార్జ్ హనుమంతు మురళీమోహన్ దొర, రామాయణం కృష్ణమాచార్యులు, రమేష్ బెహరా, వమ్మరవెల్లి శ్రీనివాసరావు, లక్కోజు శ్రీను, బత్తుల రాజారావు, కిలారి ఢిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli**, Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**